

# భక్తిగిరి
## వసుంధర

### భక్తి భావన పై సరికొత్త దృక్కోణం



## మలి అవతారాలు

గత మాసం మన పురాణాల్లో ప్రముఖంగా భావించబడే శ్రీమహావిష్ణువు దశావతారాల్లో తొలి ఐదింటి అంతరార్థాన్నీ - భక్తి, జ్ఞానం నేపథ్యంలో సృష్టి పరిణామదశ దృష్ట్యా మా అవగాహన మేరకు చర్చించాం. అదే విధంగా తదుపరి అవతారాలను ఇప్పుడు పరిశీలిద్దాం.

భగవంతుడెత్తిన మొదటి ఐదు అవతారాలూ దేవదానవులలో ధర్మ సంరక్షణకోసం ఉద్దేశించబడ్డాయి. తర్వాత నరజాతి క్రమంగా బలపడి నాగరికతను అలవర్చుకుంటోంది. తమ తమ ప్రతిభా సామర్థ్యాలకు అనుగుణంగా మనుషులు తమను తాము బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రులుగా వర్గీకరించుకుని సమ్యమనంతో పరస్పర గౌరవంతో సుఖజీవనం చేస్తున్నారు. బ్రాహ్మణులు విద్యకూ, క్షత్రియులు అధికారానికీ, వైశ్యులు సేవా తత్పరతతో కూడిన వ్యాపారానికి ప్రాతినిధ్యం వహిస్తే - శూద్రులు శ్రామికులై సమాజం మనుగడకు మూలస్తంభాలయ్యారు. విద్యాబలం, ధనబలం, శ్రమబలం సమాజశ్రేయస్సుకు ఉపయోగపడేలా చేయాల్సిన అధికార బలాన్ని పొందినవారు క్రమంగా మదోన్మత్తులై అహంకరించి - మిగతా బలాల్ని తమ స్వార్థానికి దాసోహం చేయమనగా - అది ప్రమాదకరమైన సంకేతంగా భావించిన భగవంతుడు పాలకులకు హెచ్చరికగా పరుశురామావతారమెత్తాడు. భూమ్మీద మనుషులకోసం భగవంతుడైన తొలి అవతారం పరశురామావతారం. పరిణామక్రమంలో నరసింహాన్ని అనుసరించడం వల్లనేమో ఈ అవతారనికి ఆదిమ మానవుడు స్ఫూర్తిగా నిలిచాడు. అందుకే అప్పటికి మనిషి సమర్థుడిగా, బలవంతుడిగా రూపొందినప్పటికీ పరశురాముడు గండ్రగొడ్డలి ఆయుధంగా స్వీకరించి ఆవేశానికీ, కోపానికీ మారుపేరయ్యాడు. దుష్టశిక్షణకాయన ఎన్నుకున్న మార్గం కూడా ఆటవికులనుసరించిన వేట. ఆయన ఇరవై ఒక్కమార్లు వేటాడి వెదికి దుష్టపాలకుల్ని అంతం చేసాడు. కొందరు దీన్ని రెండు కులాల మధ్య జరిగిన పోరాటంగా భావించినప్పటికీ నిజానికిది జ్ఞానానికీ, దౌర్జన్యానికీ జరిగిన పోరాటం.

క్రమంగా నాగరికత వృద్ధి చెంది రామావతార కాలంనాటికి పరాకాష్ట చేరుకుంది. మానవజాతికి అనుసరణీయమైన నీతి నియమాలు, ఆదర్శాలు ఆ కాలంలోనే రూపొందించబడ్డాయి. వాటిని ప్రజల మనసుల్లో బలంగా నాటుకుపోయేలా చేయడానికి భగవంతుడు శ్రీరాముడిగా అవతరించాడు. నీతి నియమాలను స్వయంగా ఆచరించి ప్రజలకు ఆదర్శప్రాయుడైన తొలిపాలకుడు శ్రీరాముడు. ఆయన తండ్రి మాటమీద రాజ్యత్యాగం చేసి అడవులకు వెళ్ళాడు. ఏకపత్నీవ్రతంగా భావించాడు. స్నేహానికి విలువనిచ్చాడు. స్వయంగా మహాశక్తిమంతుడైనా, తన భార్యను అపహరించిన రావణుణ్ణి కూడా చేసిన తప్పు దిద్దుకుంటే క్షమించడానికి సిద్ధపడిన

సహనం, శాంతం ఆయనవి. రాజ్యకాంక్షతో కాక తన భార్యను వెనక్కి తెచ్చుకుందుకు మాత్రమే ఆయన రావణుడితో యుద్ధం చేసాడు. శత్రువైన రావణుడిలో కూడా మంచినీ, గొప్పతనాన్నీ చూడగలిగాడు. పవిత్రతకు ప్రాధాన్యమిస్తూ, తన భార్య పవిత్రతను తాను నమ్మి సరిపెట్టుకోక ఆమెను అగ్నిపునీతగా జనసామాన్యానికి ఋజువు చేసాడు. చాలామంది భావించినట్లు అగ్నిపరీక్ష స్త్రీకోసం సృష్టించబడిన సంప్రదాయంకాదు. భార్యను అగ్నిదేవుడి బారినుండీ రక్షించుకోగల సత్తా ఉన్నవాడు మాత్రమే - ఆమె పవిత్రతను ఇతరులకు ఋజువు చేసేందుకు తలపడాలన్నది రాముడు నెలకొల్పిన సంప్రదాయం. కట్టుకున్న భార్యను కాపాడ్డానికి సామాన్య మానవుడిగా రావణుడంతటివాడితో ఢీకొన్న మమతానుబంధమాయనది. రాజు కాగానే ప్రజావాక్యానికి విలువనిచ్చి ఆమెను పరిత్యజించిన నిస్వార్థమాయనది. మనిషి మనుగడకు అవసరమైన నీతి నియమాలకు ఆదరణ రామావతారంలోనే వచ్చాయి. అందుకే ఆయన కాలం రామరాజ్యంగా ముందు తరాలవారికి ఆదర్శమైంది. ఆదర్శాలు పాటిస్తే మనిషి దేవుడౌతాడని రామావతారం చెబుతుంది.

శ్రీరాముడు నెలకొల్పిన ఆదర్శాలు అసామాన్యం. సామాన్యుడు వాటికి ఎక్కువకాలం కట్టుబడి ఉండలేకపోయాడు. రాముడు దేవుడు కాబట్టే వాటిని పాటించగలిగాడని సరిపెట్టుకోవడంతో మనిషికి తను మానవమాత్రుణ్ణన్న స్పృహ కలిగింది. దాంతో ఆదర్శాలను సడలించడం ప్రారంభించాడు. అతడిలో క్రమంగా స్వార్థం, అవినీతి పెచ్చుమీరడమేకాక - బలహీనతలు కూడా చోటు చేసుకుని పతనహేతువయ్యాయి. పతనమైన మనిషి తనకు దైవత్వం అసాధ్యమనుకుని పతనావస్థనుంచీ బయటపడే ప్రయత్నం చేయడం మానేసాడు. ఆదర్శాలు పాటించకపోయినా మనిషి దేవుడు కావచ్చునన్న భావం మనుషుల్లో కలిగించాల్సిన తరుణం వచ్చిందనుకుని భగవంతుడు శ్రీకృష్ణావతారమెత్తాడు. కృష్ణుడు బాల్యంలో అల్లరి చేసాడు. అబద్ధాలు చెప్పాడు, దొంగతనాలు చేసాడు. వయసొచ్చాక ఆడపిల్లల వెంటపడ్డాడు. స్త్రీలోలుడనిపించుకున్నాడు. ఏకపత్నీవ్రతానికి స్వస్తిచెప్పి ఏకంగా ఎనమండుగురిని పెళ్ళి చేసుకున్నాడు. ఆ తర్వాత రాజకీయవేత్తగా రాణించడానికి మోసాలు చేసాడు. అన్యాయాలకూ పాల్పడ్డాడు. భారత ఉపఖండాన్నో ఊపు ఊపిన మహాభారత యుద్ధానికి కారణం శ్రీకృష్ణుడే ఎన్ని చేసినా సమకాలీనుల్లో అధిక సంఖ్యాకులాయన్ను దేవుడని కీర్తించే మంచి పనులెన్నో చేసాడు. ఆయన చేసిన మంచి పనుల కారణంగా ఆయన చేసిన చెడ్డ పనులన్నీ లీలలయ్యాయి. తనను నమ్మినవారికి ఉపకారం చేస్తూ, తన జోలికి వచ్చినవారిని మాత్రమే శిక్షిస్తూ - దైవత్వానికి కొత్త నిర్వచనమిచ్చాడాయన. కాలానుగుణమైన శ్రీకృష్ణావతారం మనిషి మనిషిలా ప్రవర్తించినా దేవుడు కావచ్చునని నిరూపించింది.

ధర్మ సంస్థాపన కోసం శ్రీకృష్ణుడు మహాభారత యుద్ధాన్ని ప్రోత్సహించి ఉండవచ్చు. కానీ ఆ తర్వాత కొంత కాలానికి భరతావనిలో యుద్ధాలు సర్వసాధారణమైపోయాయి. మనుషుల్లో స్వార్థంతోపాటు హింసాతత్వం పెరిగింది. ఆ సమయంలో శ్రీ మహావిష్ణువు గౌతమ బుద్ధుడిగా అవతరించి మనిషిని శాంతిమార్గంవైపు మళ్ళించడానికి అహింసను ప్రతిపాదించాడు. జీవహింసను వ్యతిరేకిస్తూ పశుపక్ష్యాదులను కూడా ప్రేమించమని ఆయన ప్రభోదిస్తుంటే మనిషి సాటి మనిషిని హింసించలేడు కదా! సర్వమానవ సమానత్వాన్నీ, శాంతియుత సహజీవనాన్నీ ప్రబోధిస్తూ సుఖ సంతోషాలకు మార్గం సంతృప్తిలో ఉన్నదన్న ఆయన మాటలు అతి సామాన్యులకు కూడా సులభగ్రాహ్యమయ్యాయి. బౌద్ధమతం భరతావని ఎల్లలు దాటి విదేశాలకు కూడా విస్తరించింది.

దశావతారాల్లో చివరిది ఇంకా మన ముందుకురాని కల్కి అవతారం. అధర్మం పెచ్చుమీరిపోయిన కలియుగంలో భగవంతుడు కల్కిగా అవతరిస్తాడు. ఆయన గుఱ్ఱమెక్కి, చేతిలో కత్తితో వీరవిహారం చేస్తూ దుష్టులను సంహరిస్తాడట.

దశావతారాల్లో మొదటి ఐదూ సృష్టి పరిణామ దశను సూచిస్తే తర్వాతి నాలుగూ మానవ జాతి పరిణామదశలను సూచిస్తాయనిపిస్తుంది. ఐతే తొమ్మిది, పదవ అవతారాలు వివాదాస్పదం. కొందరు బుద్ధుడి బదులు బలరాముణ్ణి విష్ణువు అవతారంగా చెబుతారు. హిందూమతం అంతరించిపోయే పరిస్థితి ఏర్పడితే శంకరాచార్యులవారి కాలంలో మత రాజకీయం పాటించి బుద్ధుణ్ణి తొమ్మిదవ అవతారం చేసారన్న వాదమూ ఉంది. ఒక దేవుడికీ, ఒక మతగ్రంధానికీ కట్టుబడని హిందూత్వం మతమని మాకెప్పుడూ

అనిపించదు. హిందూత్వంతో ముడిపెడితే కృష్ణావతారం తర్వాత బుద్ధావతారం తార్కికంగా సమర్ధనీయమే అనిపిస్తుంది. ఎటొచ్చీ కాలానుగుణమని తోచని కల్కి అవతారం మాత్రం మాకు మింగుడు పడదు. తొమ్మిది అవతారాలనింత చక్కని వరుసక్రమంలో పేర్చినవారి ఊహ పదవ అవతారంలో పేలవంగా తోస్తుంది. దశాంశ పద్ధతిలోని గొప్పతనాన్ని గుర్తించిన మన పూర్వీకులు దేవుడి అంశలకూ అదే పద్ధతి ఉపయోగించాలన్న తాపత్రయంలో పది సంఖ్యని ఎన్నుకున్నారనీ, పదవ అవతార లక్షణాల విషయంలో తగిన శ్రద్ధ తీసుకోలేదనీ అనుకుంటే - అందుకు కాలమే తగిన సమాధానమిస్తుంది. కానీ ఇప్పటికే తాము కల్కి అవతారమనేవారు కూడా ఉంటే అది వేరే సంగతి.

మాన్యుడైనా భగవంతుడిపై నమ్మకమే జ్ఞానాన్వేషణలో తొలిమెట్టు అని గుర్తించే వివేకాన్నీ అవతారాలు పెంపొందించగలవని గత మాసంలో అన్నాం కదా! కానీ భగవంతుడంటూ ఒకడున్నాడని ఎలా నమ్మడం? ఈ ప్రశ్నకి మతవిశ్వాసంతో కాక తార్కికంగా సమాధానం వెదికే ప్రయత్నం వచ్చే నెల....

## జ్ఞాన జ్యోతి



మాసిన దుస్తులు విడిచి శరీరాన్ని శుభ్రంగా రుద్దుకుని స్నానం చేసి పరిశుభ్రమైన దుస్తులు వేసుకున్న తర్వాత నీవెలాంటి శాంతినీ, ప్రసన్నతనీ పొందుతావో, మనసులోని మాలిన్యం తొలగిపోతే మనసుకు అంతకంటే ఎక్కువ ప్రశాంతత లభిస్తుంది.

స్నానం చేసి పరిశుభ్రమైన దుస్తులు ధరించడం శరీరంయొక్క పవిత్రత. ఎవరినీ నిందించకుండా అందరికీ నచ్చే మాటలు మాట్లాడ్డం వాక్కు పవిత్రత అవుతుంది. దురాలోచనల్ని రానీయక మంచి ఆలోచనలనే పెంచుకోవడం మానసిక పవిత్రత ఔతుంది. ఈ మనోవాక్కాయములకు సంబంధించిన త్రివిధ పరిశుభ్రతే మనిషిని పరిపూర్ణుడ్ని చేస్తుంది.